క్లుప్తంగా

నేటి నుంచి కాళికాదేవి ఉత్సవాలు ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని దేవిన గర్‌లో కాళికాదేవి ఆలయంలో సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం గంగా పూజా, పల్లకి సేవా ఊరేగింపు, హోమం. మంగళవారం అమ్మవారి కుంకుమార్చన, దీపోత్సవం. గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కుబడులు తీర్చుకుంటారు.

ఆర్థిక సాయం అందజేత



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో వారం రోజుల క్రితం మృతిచెందిన మల్లికార్జున్ కుటుంబానికి వారి మిత్రబృందం సభ్యులు ఆదివారం రూ. 30వేల నగదును అందజేశారు. మృతుడు కారు డ్రైవింగ్ చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మక్తల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల 2009లో పదోతరగతి బ్యాచ్ స్నేహితులు విషయం తెలుసుకొని మృతుడి భార్య శిరీషకు రూ. 30వేల నగదును అందించారు. కార్యక్రమంలో మిత్రబృందం సభ్యులు నరేష్, సాగర్, తెలుగు వెంకటేష్, నర్సయ్యగౌడ్, బసవరాజు, నరేష్, గ్రామస్తులు కత్తలప్ప, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు



మరికల్: లేబర్ కార్డు కలిగిన కార్మికులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచితరక్త పరీక్షలను నిర్వహించారు. ఆదివారం పాత పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన శిబిరంలో గుర్తింపు కార్డులు కలిగిన వివిధ రంగల్లో పనిచేస్తున్న కార్మికులందరికి 50మందికి రక్త పరీక్షలను చేశారు. వారం రోజుల తర్వాత రిపోర్ట్స్ పంపిస్తామని డాక్టర్ అబ్దుల్ నహిం, యశ్వన్, శివలీలలు తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ముఖ్య నాయకులు గోపి, కుర్మన్న, ఆంజనేయులు, రాము తధితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత



నారాయణపేట: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రోడ్డు మార్గానా తనిఖీలు నిర్వహిస్తుండగా నారాయణపేట నుంచి బొమ్మన్‌పాడు వెళ్తున్న కాశప్పతో 17.4 లీటర్ల లిక్కర్ (రూ. 5800/) పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఆ మద్యాన్ని స్థానిక పీఎస్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అక్రమంగా మద్యం తరలిస్తున్న కాశప్పపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలు ఎవరు అక్రమంగా నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లొద్దన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో నిత్యం విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా పందులు రావడం, రాత్రి వేళలో కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించి బాటిలను పగల కొట్టడం వంటివి చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



బియ్యం అక్రమ రవాణా

- కర్ణాటక, మహారాష్ట్రకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

మరికల్: పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత రేషన్ బియ్యం పథకం పక్కదారి పడుతుంది. టన్నుల కొద్ది బియ్యం సరిహద్దులు దాటి వెళ్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. కొన్ని గ్రామాల్లో అడ్డాలు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. ప్రజలతో కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేసే వ్యాపారులు, దళారులకు మాత్రం రూ. 20 చొప్పున విక్రయిస్తూ కాసులు సొమ్ముచేసుకుంటున్నారు. పేట నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలో కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నారు. కొంతమంది డీలర్లు కూడా ఈ బియ్యం సేకరించి అక్రమ వ్యాపారులకు అమ్ముతున్నట్లు తెలిసింది. ఇంత జరుగుతున్న సివిల్ సప్లయ్ అధికారులు బియ్యం అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రాలు దాటుతున్న బియ్యం..

గ్రామాల్లో వ్యాపారులు సేకరించిన బియ్యం రాష్ట్రాలు దాటుతున్నాయి. రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలయినా కర్ణాటక , మహారాష్ట్రకు తరలుతున్నాయి. మొదటగా చిన్న చిన్న ఆటోల్లో వీటిని సేకరించి ఒక చోటకు చేరుస్తున్నారు. కొంత జమయిన తర్వాత డీసీఎం, బొలెరో వాహనాల్లో తరలిస్తున్నారు. కొందరు మహారాష్ట్ర వరకు బొలెరో వాహనాల్లో బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. ఎవరైనా అడిగితే ఇక్కడి వారు మహారాష్ట్రలో ఉన్నారని అలాంటి వారి బియ్యం సేకరించి వారున్న దగ్గరికి చేరవేస్తున్నట్లు చెపుతున్నారు.



డీసీఎంలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బియ్యం కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తమ దృష్టికి రాలేదు. రేషన్ బియ్యం తరలిస్తున్న విషయం తమ దృష్టికి వస్తే దాడులు నిర్వహించి బియ్యం సిజ్ చేసి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–కాళప్ప, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్‌ఐ నారాయణపేట

ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మక్తల్: రైతు సమస్యలపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి అవగాహన లేదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పదిసంవత్సరాలుగా సంగెంబండ ప్రాజెక్ట్ పనులు కొనసాగక అతిగతి లేకుండగా ఉండటానికి కారణం మాజీ ఎమ్మెల్యే కాదా అని వారు విమర్శించారు. చిన్న సమస్యలపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేస్ కుమార్, మాజీ ఉపసర్పంచు కట్టసురేస్, అనంద్‌గౌడ్,శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, మాజీ మార్కెట్ చేర్మేన్ రాజప్పగౌడ్, గోవర్ధన్,రవికుమార్, అబ్దుల్‌హూసే పాల్గొన్నారు.

కృష్ణా: రైతు సమస్యలపై ఎమ్మెల్యే శ్రీహరికి అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విమర్శించడం అర్థరహితమని కాంగ్రెస్ మండల నాయకుడు భీమ, శంకర్, యువజన నాయకుడు తమ్మప్ప, నర్సింహులు సరికాదన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సంగెంబండ ప్రాజెక్ట్ పనులు కొనసాగక అతిగతి లేకుండగా ఉండటానికి కారణం మాజీ ఎమ్మెల్యే కాదా అని విమర్శించారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు.

బైకు, కారు ఢీ : ముగ్గురికి గాయాలు

నారాయణపేట రూరల్ : అతివేగంగా కారు నడిపిస్తూ బైక్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా.. ఊట్కూర్ మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన సోమప్ప తన భార్య అంజమ్మ, కుమార్తె భవానితో కలిసి ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై పేటకు వచ్చాడు. ఉగాది పండగ సందర్భంగా బట్టలు కొనుగోలుచేసి తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బీవండికాలనీ సమీపంలో మహబూబ్‌నగర్ నుంచి ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఢీ కొంది. కారు డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యంతో బైక్‌పై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. గాయాలైన వారిని 108 ఆంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



బీవండికాలనీ వద్ద బైక్‌ను ఢీ కొట్టిన కారు

వేద పాఠశాల ఏర్పాటుకు సహకరిస్తాం



తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వేద పాఠశాల ఏర్పాటుకు సహకరిస్తానని, స్థలం కూడా ఇచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రీవైష్ణవ వైఖానస బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మాన్ని ముందు తరాలకు అందిస్తున్న మీరందరూ ధన్యులు అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శ్రీవైష్ణవ వైఖానస బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర అర్చక సంఘం అధ్యక్షులు శ్రీనివాసాచార్యులు, జిల్లా అధ్యక్షులు పవన్‌కుమార్ ఆచార్య, రమణమూర్తి, మణి ఆనంద్‌కుమార్, నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రాహ్మణులకు ఉత్తరీయాలు సమర్పించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లింలకు ఆయన ఖజూర్, పండ్లు తినిపించారు.

ప్రతి ముస్లిం నిరుపేదలకు అండగా ఉండాలి

ఆత్మకూర్: ప్రతి ఒక్క ముస్లిం నిరుపేదలకు అండగా ఉండాలని, సంపాదనలో కొంతభాగం తప్పనిసరిగా పేదలకు (జకాత్) ఇవ్వాలని ముఫ్తి సయ్యద్ ఫహీమ్ నద్వి, మౌలానా అబ్దుల్‌అలీం రషాదీ, మౌలాన జీయా ఉర్ రహ్మన్, మౌలానా ముక్తదీర్, సయ్యద్ మగ్దూంఅలీ అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలోని అత్యంత ప్రాముఖ్యమైన శబేఖద్ర్ పర్వదినం సందర్భంగా స్థానిక మస్‌జిదే ఆజం జాహి, మస్జిదేసయ్యిదియా, ఈద్గామస్జీద్‌లతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రా ర్థనలు చేశారు. ప్రతి ముస్లిం దివ్యఖురాన్‌ను పఠించాలని, దివ్యఖురాన్ సర్వమానవళికి మార్గదర్శమని, ఐదు పూటల నమాజు ఆచరించాలన్నారు. మ హ్మద్ రసూలిల్లాహ్ సల్లాల్లాహు వలైవసల్లంవారిపై అల్లాహ్ ఆదేశాలను ప్రకటించినట్లు గుర్తుచేశారు.

ప్రమాదకరంగా మలుపు

మాగనూర్: మండల పరిధిలోని వాడ్వట్ నుంచి మందిపల్లికి వెళ్లే రహదారిలో మలుపులతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న అధికారులలో మాత్రం చలనం లేకుండా పోయింది. అనేక సార్లు అధికారులకు విన్నవించినా ఈ దారిలో కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రైతులకు అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో ఎక్కడబడితే అక్కడ రోడ్డును రైతులు తవ్వేస్తున్నారు. వీటితో కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మారిన రోడ్డు

విగ్రహాల అందజేత



మక్తల్: పట్టణంలోని చెక్కెర ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించేందుకు పట్టణానికి చెందిన సుజాత, ఆశన్న దంపతులు సొంత డబ్బులు రూ.లక్ష వెచ్చించి సీతారాముల, ఆంజనేయస్వామి విగ్రహాలను చేయించి ఆలయానికి అందజేశారు. విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమం చేయించారు. ప్రాయశ్చిత, హోమం, మంగళహారతి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మామిళ్ల సుజాత, ఆశన్న దంపతులు, కుటుంబ సభ్యులు సుధీర్‌కుమార్, పృథ్వీరాజ్, వేదపడింతులు రాఘవేందర్‌రావు, వంశీకృష్ణ, విద్వాన్, శేషగిరి, శ్రీనివాసులు, జగన్నాథ్, అంజన్‌ప్రసాద్, మహదేవ్, శ్రీధర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజంలో ప్రతి ఒక్కరికి ఉచిత విద్య, వైద్యం అందించడమే తమ పార్టీ ముఖ్య ఎజెండా ప్రగతి శీల సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ కార్యవర్గ సమావేశం జూమ్ మీటింగ్ ద్వారా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎజెండాతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 7 స్థానాల్లో తమపార్టీ తరఫున అభ్యర్థులను బరిలో నిలువుతున్నట్లు తెలిపారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమపార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకుపోయేందుకు అనేక కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి అవసరమైయే విద్య, వైద్యం ఉచితంగా అందించడంలో ప్రభుత్వాలు ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. ఈసమావేశంలో ఆయా జిల్లాలకు చెందిన అధ్యక్షులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో ఆదివారం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. తుమ్మల అరుణమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను సన్మానించి కొత్త వస్త్రాలను, నగదు పారితోషికాలను పంపిణీ చేశారు. నాయకులు ప్రభు, ఆంజనేయులు, నరేష్, పుల్లారావు, భాగ్యమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, మన్నెపురెడ్డి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



స్టేషన్ మహబూబ్‌నగర్: వివేకానంద విద్యానికేతన్ స్కూల్ పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం రిటైర్డ్ ఎంఈఓ నారాయణరావు ప్రారంభించారు. సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు. గత 8 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రత్నాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నీలంరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, సభ్యులు శ్రీనివాసరాజు, అంజద్, నజీర్, శ్రీనివాస్, కిషోర్, విష్ణు, మురళీకృష్ణ, శ్రీను, నవీన్, నవాబ్‌ఖాన్, సుదర్శన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరిశీలకుడిగా మహ్మద్ అక్బర్

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ మైనార్టీ విభాగం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ అక్బర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్, తెలంగాణ ఇన్‌చార్జీ ఫర్హాన్ అజ్మి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మహ్మద్ అక్బర్ మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించడంపై నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

మక్తల్: ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ–2 ఆచారి అన్నారు. ఆదివారం మండలంలోని జక్లేర్, గుడిగండ్ల గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల సంఘం, పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల విషయంలో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ–2 ఆచారి తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సీడీపీ నిధులతో తాగునీటి బోరు



విద్యుత్ బోరును ప్రారంభిస్తున్న నాయకులు



దేన్యానాయక్ తాండాలో తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్ చేస్తున్న దృశ్యం

దామరగిద్ద: మండలంలోని మల్‌రెడ్డిపల్లిలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మంజూరు చేసిన సీడీపీ నిధుల నుంచి తాగునీటి బోరు వేయించారు. నీళ్లు లభించడంతో ఆదివారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గోపాల్, మహిపాల్, శివకుమార్, మాజీ ఉప సర్పంచ్ సవిత, సాయిలు కలిసి విద్యుత్ మోటార్‌ను ప్రారంభించారు. వేసవికాలం కావడంతో నీటిఎద్దడి నివారణకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో బోరు వేయించడం సంతోషనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పెరుమళ్ల, శివకుమార్, ఖాశీం, మొగులప్ప, అంజి పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో తాగునీటి ఎద్దడిని నివారించడానికి సీఎం రేవంత్ మండలానికి రూ. కోటి 13లక్షల స్టేడ్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కేటాయించారు. ఈ నిధులతో ఆదివారం మండలంలోని దేన్యానాయక్ తాండాలో బోరు డ్రిల్లింగ్, రెనివట్లలో పాత మోటారును రిపేరు చేయించినట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. అలాగే మండలంలోని 49 గ్రామ పంచాయతీల్లో అత్యవసరం ఉన్న చోట ఈ నిధులను వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక..

మక్తల్: పట్టణంలోని రవి కన్వేన్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో మండలంలోని భూత్‌పూర్ మాజీ సర్పంచ్ కుర్వ హన్మంతు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. భూత్పూర్‌కు చెందిన ఆనంద్‌శేఖర్, లక్ష్మారెడ్డి, ఉప్పరి ఆనంద్‌లతోపాటు మరికొందరు చేరారు. అదేవిధంగా దాదాన్‌పల్లి, మక్తల్, పస్పుల, గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని డీకే అరుణ పార్టీకండువా కప్పిఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నాగురావునామాజీ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ చైర్మన్ పావని, బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కనకరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, అనంపల్లి కొండయ్య, ప్రసన్నరెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు భరత్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో డీకే అరుణ

నీటి వనరులను రక్షించుకుందాం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: నీటి వనరులను రక్షించుకుందామని విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సుప్రభాత్ హెల్త్ క్లబ్ కన్వీనర్ జి.పాండురంగం ఆధ్వర్యంలో నీటి వనరులను రక్షించుకుందాం అనే అంశంపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు నీటి రక్షించుకొనే విధానంపై సూచనలు అందజేశారు. పాండురంగం మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి నీటిబొట్టును రక్షించుకుందామని కోరారు. ఈ వేసవిలో నీటిని రక్షించుకొనుటపై ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ చందర్, డాక్టర్ వెంకట్రాంరెడ్డి, యాదిరెడ్డి, అనంతరెడ్డి, శంకరయ్య, యాదయ్య, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే సత్ఫలితాలు



మరికల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ లింగయ్య



ఆత్మకూర్‌లో..

మరికల్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నిలబెట్టేందుకు విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని డీఎస్పీ లింగయ్య అన్నారు. మండలంలోని ఆదివారం జరిగిన ప్రతిభ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్‌కోసం ఎంతో కష్టపడి పనిచేసే తల్లిదండ్రుల ఆశయాలు నేరవెర్చే బాధ్యత విద్యార్థులపై ఎంతైన ఉందన్నారు. మారుతున్న కాలనుగుణంగా సెల్‌ఫోన్‌ను మంచికి వాడుకోవాలని, చేడుకు దూరంగా పెట్టాలన్నారు. ఎంతో ఉన్నతమైన విద్యాను అందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు గతేడాది పది ఫలితల్లో పదికి పది గ్రేడ్ సాధించిన ఐదు మంది విద్యార్థులను డీఎస్పీ సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థులు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సీఐ రాజేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ప్రిన్సిపాల్ తమిల్‌రైన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆత్మకూర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే సత్ఫలితాలు సాధించి లక్ష్యాన్ని చేరుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంవీరామన్ హైస్కూల్ సీబీఎస్‌ఈ పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మణ్ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఆన్సిశ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

బీజేపీ మద్దతుతోనే కలెక్టర్‌కు ఫిర్యాదు

అమరచింత: మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆమెను గద్దెదించి వైస్ చైర్మన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోవాలనే లక్ష్యంతో సీపీఎం బీజేపీ కౌన్సిలర్‌తో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. సీపీఐ కౌన్సిలర్, జిల్లా కార్యదర్శి విజయరాములు చైర్మన్‌గా ఉండాలనే బీజేపీ కౌన్సిలర్‌తో కలిసి కుట్రపన్నాడని సీపీఎం ఆరోపించడం తగదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న జీఎస్ గోపి తీర్థయాత్ర పేరుతో తిరుపతి వెళ్లారని, అక్కడే బీజేపీ కౌన్సిలర్‌తో జతకట్టి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించిన విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. సీపీఎం కౌన్సిలర్ మున్సిపల్ చైర్మన్‌గా, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ వైస్ చైర్మన్‌గా ఉండాలని నిర్ణయించుకున్నారని వెల్లడించారు. ప్రస్తుతం అవినీతిపై పోరాటం చేయాలన్న ఉద్దేశ్యంతో ఐదుగురు కౌన్సిలర్లు పోరాడుతున్నారని, వీటిని జీర్ణించుకోలేక సీపీఐపై విష ఆరోపణలు చేయడం తగదన్నారు. మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీపీఐ పట్టణ అధ్యక్షుడు భాస్కర్, కుతుబ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్రహం